చిరువ్యాపారులకు పెద్ద కష్టం

- వరద ఉధృతికి కొట్టుకుపోయిన దుకాణాలు..
- రూ.లక్షల్లో నరుకు నీటిపాలు
- తీవ్ర ఆవేదనలో చిరువ్యాపారులు
- ఆదుకోవాలని ప్రభుత్వానికి వినతి



వరద ఉధృతికి శ్రీతిరుపతమ్మ ఆలయం వద్ద ఆనవాళ్లు సైతం కోల్పోయిన బొమ్మల దుకాణాలు

పెనుగంచిప్రోలు: ఇటీవల సంభవించిన వరదలు పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద చిరువ్యాపారాలు చేసుకునే వారికి తీరని వేదన మిగిల్చాయి. మునేరుకు వచ్చిన భారీ వరద ఉధృతికి ఆలయ పరిసరాల్లోని పలు దుకాణాలు కొట్టుకుపోయాయి. దుకాణాల్లోని బొమ్మలు, దేవుని పటాలు, పూజా సామగ్రితోపాటు క్యాంటీన్‌కు చెందిన గ్యాస్ సిలిండర్లు, ఇతర వస్తువులు వరదనీటిలో కొట్టుకుపోతుంటే ఏమిచేయలేని నిస్సహాయస్థితిలో ఉండటం మినహా ఏవస్తువును కాపాడుకోలేకపోయారు.వరదముంపు దెబ్బకు ప్రాణాలైనా దక్కుతాయా? అన్న పరిస్థితిని ఎదుర్కొన్నామని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



తడిసిన సరుకును ట్రాక్టర్‌లో తీసుకువెళ్తున్న వ్యాపారులు

రూ.20లక్షలకు పైగా ఆస్తినష్టం...

వరద ప్రభావంతో చిరువ్యాపారులు సుమారు రూ.20నుంచి రూ.25లక్షల వరకు నష్టపోయినట్లు అంచనా వేస్తున్నారు. దేవాలయం ఆధ్వర్యంలో 35 వరకు దుకాణాలు ఉండగా, మునేరులో అనధికారికంగా మరో 20 దుకాణాలు ఉన్నాయి. మునేరులో తాత్కాలికంగా వేసుకున్న దుకాణాల పాకలు పూర్తిగా నీటిలో కొట్టుకుపోగా ఆలయ సమీపంలో వాటిలో 10దుకాణాలు వరద నీటికి కొట్టుకుపోయాయి. దుకాణాల్లో నిల్వ ఉంచిన సరుకు కూడా నీటి పాలైంది. మిగిలిన సరుకు కూడా వరదనీటిలో నానిపోవడంతో ఎందుకు పనికిరాకుండా పోయిందని బాధితులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా సాయం అందించి తమను ఆదుకోవాలని బాధిత చిరువ్యాపారులు కోరుతున్నారు.



ఎండలో ఆరబెట్టిన పూజా సామగ్రి

దుకాణమే కొట్టుకుపోయింది..



వరద ప్రవాహానికి ఆలయం ముందు చివర ఉన్న నాదుకాణం మొత్తం కొట్టుకు పోయింది. రూ.లక్షల విలువ చేసే సరుకు కూడా నీటిపాలైంది. సరుకును వెంటనే ఒడ్డుకు చేర్చుకోలేక చాలా నష్టపోయాను. మళ్లీ పెట్టుబడి పెట్టే పరిస్థితి లేదు.

– రమాదేవి, బొమ్మల దుకాణదారు

రూ.2లక్షలు నష్టం..



మునేరు వరద ఉధృతికి క్యాంటీన్ తలుపు విరిగిపోయింది. దీంతో క్యాంటీన్‌లోని 20 సిలిండర్లు, రవ్వ, పల్లీలు బస్తాలతోపాటు కూల్‌డ్రింక్స్, వాటర్‌బాటిల్స్ కొట్టుకు పోయాయి. దీంతో రూ.2లక్షల వరకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకుని అండగా నిలవాలి.

-ఎల్.కోటిరెడ్డి, ఆలయ క్యాంటీన్ నిర్వాహకుడు

దిక్కుతోచడం లేదు..



మా బొమ్మల దుకాణాన్ని వరద నీరు చుట్టు ముట్టింది. ఏమీ చేయలేని పరిస్థితిలో సుమారు రూ.2లక్షల సరుకు మొత్తం వరదలో కొట్టుకుపోయింది. ఏమి చేయాలో దిక్కు తోచటం లేదు. మాలాంటి చిరు వ్యాపారులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఝాన్సీ, బొమ్మల దుకాణదారు

చైర్మన్ రాఘవేంద్ర రాజీనామా చేయాలి

వైఎస్సార్ సీపీ నాయకుల డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న కౌన్సిలర్ వట్టెం మనోహర్

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రకు చిత్తశుద్ధి ఉంటే వైఎస్సార్‌సీపీ ద్వారా లభించిన కౌన్సిలర్, చైర్మన్ పదవులకు రాజీనామా చేయాలని ఆపార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఐదోవార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్, వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు ముసిని శివ శుక్రవారం ఏర్పాటు చేసిన వేర్వేరు ప్రెస్‌మీట్లలో ఈ మేరకు డిమాండ్ చేశారు. చైర్మన్ రాఘవేంద్ర చర్యను తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిలర్లు గింజుపల్లి వెంకట్రామయ్య, పూసల సీతారావమ్మ, దువ్వల రమాదేవి వారి పదవులకు రాజీనామా చేశాక, ఏపార్టీలోకి వెళ్లినా తమకు అభ్యంతరం లేదన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ఆశీస్సులతో పదవులు పొంది, అదే పదవులతో టీడీపీలోకి వెళ్లడం శోచనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జగ్గయ్యపేట పట్టణం అభివృద్ధి చెందలేదని చైర్మన్ రాఘవేంద్ర పేర్కొనడం తన రాజకీయ దిగజారుడు తనానికి నిదర్శనమని విమర్శించారు. 41ఏళ్ల జగ్గయ్యపేట మున్సిపాలిటీ చరిత్రలో ఈ పాలకవర్గ హయాంలోనే రెండేళ్లలో రూ.27.27కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, రాష్ట్రంలోని 111 మున్సిపాలిటీల్లో ఈ ఘనతను సాధించినది జగ్గయ్యపేట మాత్రమేనంటూ చైర్మన్ రాఘవేంద్ర ఇటీవల ప్రకటించిన వైనాన్ని పట్టణ ప్రజలు ఇంకా మరిచిపోలేదన్నారు. చైర్మన్ రాఘవేంద్ర, ఆ ముగ్గురు కౌన్సిలర్లు అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. చైర్మన్ రాఘవేంద్ర, ఆ ముగ్గురు కౌన్సిలర్లకు ఏమాత్రం నైతికవిలువలు ఉన్నా వైఎస్సార్‌సీపీ ద్వారా లభించిన పదవులకు వారు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

బాధితులకు రామ్‌కో చేయూత

జగ్గయ్యపేట అర్బన్: వరద బాధితులందరినీ తమ ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పేర్కొన్నారు. స్థానిక నాగమయ్య బజారులో వరద ముంపునకు గురైన బాధితులకు ఎమ్మెల్యే సూచనల మేరకు రామ్‌కో సిమెంట్స్ వారు నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సరుకులను ఎమ్మెల్యే తాతయ్య శుక్రవారం బాధితులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నూకల కుమార్ రాజా, మాజీకౌన్సిలర్ కటికల అనిల్, నాయకులు పున్నా ఉపేంద్ర, కె.సూర్యప్రకాష్, రామ్‌కోసిమెంట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. అదేవిధంగా విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక శాంతినగర్, విష్ణుప్రియనగర్‌వాసులు చింతామణి ఆంజనేయస్వామి కమిటీ ఆధ్వర్యంలో తమవంతు సహాయంగా నిత్యావసర సరుకులను అందజేశారు. నిత్యావసర సరుకుల వాహనాన్ని ఎమ్మెల్యే తాతయ్య జెండా ఊపి ప్రారంభించారు.



నాగమయ్యబజారులో నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, రామ్‌కో సిమెంట్స్ ప్రతినిధులు

క్లుప్తంగా

టీడీపీలో చేరిక

జగ్గయ్యపేట: మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, 7, 23, 31వ వార్డుల కౌన్సిలర్లు పూసలపాటి సీతారావమ్మ, దువ్వల రమాదేవి, గింజుపల్లి వెంకట్రామయ్య టీడీపీలో చేరారు. ఉండవల్లిలో ఐటీశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ నివాసంలో ఆయన సమక్షంలో శుక్రవారం వారు టీడీపీలో చేరారు. వీరికి లోకేష్ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు కిట్లు పంపిణీ



పెనుగంచిప్రోలు: వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు శుక్రవారం నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. మండలంలోని ముచ్చింతాలలో సర్పంచ్ జక్కులూరి రాంబాబు, గుమ్మడిదుర్రులో సర్పంచ్ నక్కా కమల సరుకులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ మండలంలో 12 గ్రామాల్లోని 1585మందికి ఈ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బాధితులకు 25కిలోల బియ్యం, బంగాళదుంపలు, ఉల్లిగడ్డలు, పంచదార, నూనె ప్యాకెట్‌తో కూడిన కిట్‌ను అందిస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకు 1200 మందికి పంపిణీ చేశామని తెలిపారు.

విరాళమందించడం అభినందనీయం



నందిగామ టౌన్: వరద బాధితులను ఆదుకునేందుకు కమ్మ సంఘం ఆధ్వర్యంలో విరాళం అందించడం అభినందనీయమని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో కమ్మ సంఘం కమిటీ సభ్యులు శుక్రవారం ఆమెను కలిసి వరద బాధితుల కోసం రూ.రెండు లక్షలను విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ సంఘం గౌరవాధ్యక్షుడు వసంత వెంకట కృష్ణప్రసాద్ సూచనల మేరకు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కామసాని సత్యవతి, వాసిరెడ్డి సత్యనారాయణ ప్రసాద్, వాసిరెడ్డి శ్రీరామకృష్ణ, వాసుదేవరావు, పాలేటి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పైపులైన్ పనులు



కంచికచర్ల : వరదలకు కీసర మున్నేరులో గండేపల్లి మంచినీటి పథకం పైపులైన్ కొట్టుకుపోవడంతో ఆస్థానంలో నూతన పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పైపులైన్ పనులు ఐదురోజులుగా ముమ్మరంగా సాగుతున్నాయి. మరోరెండురోజుల్లో పైపులైన్ పనులు పూర్తిచేసి, ప్రజలకు మంచినీటిని సరఫరా చేస్తామని గ్రామసర్పంచి బొక్కా రవికుమార్ శుక్రవారం తెలిపారు.

నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి, ముక్త్యాల గ్రామాల్లోని కృష్ణానది వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం చేపట్టిన ఏర్పాట్లను ఎస్‌ఐ తోట సూర్యశ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనాల కోసం వేదాద్రి వద్ద ఫంటు ఏర్పాటు చేశామని, ఫంటు ద్వారానే నిమజ్జనాలు జరుగుతాయన్నారు. నదిలో నీరు అధికంగా ఉన్నందున నిమజ్జనానికి విగ్రహాలు తీసుకువచ్చేవారు పోలీసుల సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. ఇష్టానుసారంగా నిమజ్జనాలు కొనసాగిస్తే చర్యలు తప్పవన్నారు. నవరాత్రి ఉత్సవాల తొమ్మిదోరోజైన ఈనెల 15వతేదీ ఆదివారం రోజున నిమజ్జనానికి పెద్దసంఖ్యలో గణపతి విగ్రహాలు వచ్చే అవకాశం ఉండటంతో పుష్కర ఘాట్‌ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

రేపు ఉచిత కంటివైద్య శిబిరం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శ్రీగోపయ్య సదన్‌లో విజయవాడ అమరావతి కంటి ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో జీవీడీఎన్ లీలాకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈవో కోరారు.

ఆదుకోవాలంటూ ఆర్డీవోకు వినతి

నందిగామ టౌన్: ఇటీవల కురిసిన వర్షాలు, సంభవించిన వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చనుమోలు సైదులు, కటారపు గోపాల్ కోరారు. అన్నిరకాల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం నందిగామ ఆర్డీవో ఎ.రవీంద్రరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట మునిగిన ఇళ్లకు విజయవాడలో ఇచ్చిన విధంగా ప్రతి కుటుంబానికి రూ.25వేలు పరిహారం, నిత్యావసర సరుకులు అందించాలని కోరారు. నీట మునిగిన అన్ని రకాల పంటలకు నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపీ నాయక్, షేక్ హుసేన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో రవీంద్రరావుకు వినతిపత్రం అందజేస్తున్న చనుమోలు సైదులు, కె.గోపాల్ తదితరులు

ఏచూరి మృతి తీరనిలోటు



వీరులపాడులో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



పేటలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

వీరులపాడు:ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉద్యమాలు సాగించిన సీపీఎం జాతీయ ప్రధానకార్యదర్శి ఏచూరి సీతారాం మృతి బాధాకరమని ఆపార్టీ సీనియర్ నాయకుడు వట్టికొండ పార్థసారధి అన్నారు. వీరులపాడు సీపీఎం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. తొలుత ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్థసారధి మాట్లాడుతూ ఏచూరి మృతి పార్టీకి, ప్రజలకు తీరనిలోటన్నారు. ఏచూరికి నివాళులర్పించిన వారిలో ఆపార్టీ నాయకులు చాట్ల రవి, వట్టికొండ రమేష్, వాసిరెడ్డి రాంబాబు, మచ్చ సత్యనారాయణ, మేదర నాగేశ్వరరావు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి ఆపార్టీ మండల నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. మండల పార్టీ ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. సీతారం ఏచూరికి నివాళులర్పించినవారిలో సీపీఎం పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి, నాయకులు కోట కృష్ణ, కోట రవికుమార్, దంతాల వెంకటేశ్వర్లు, దాసరి నాగేశ్వరరావు, రాంప్రసాద్, రావెళ్ల శేషు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు పారా ఎలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మందులు అందజేత

నందిగామ టౌన్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నులిపురుగుల నివారణ మందులను అందజేశారు. ఈసందర్భంగా ఎంపీపీ ఆకుల హనుమంతరావు(రంగా)మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మందులను తీసుకోవడం ద్వారా రక్తహీనత,ఆకలిలేమి తదితర ఇబ్బందులను అధిగమించవచ్చన్నారు.వైద్యారోగ్య సిబ్బంది పర్యవేక్షణలో అన్ని పాఠశాలల విద్యార్థులకు మందులు అందించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య రంగంలో ఏఐ కీలకపాత్ర



శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులతో అతిథులు మధు, సాయిసతీష్

లబ్బీపేట(విజయవాడతూర్పు):ఆరోగ్యసంరక్షణ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) క్రాంతికర మార్పులు తీసుకొస్తుందని... ఇది వ్యాధుల నిర్ధారణ, చికిత్స, ఆరోగ్య నిర్వహణలో నూతన మార్గాలని అందిస్తోందని హైదరాబాద్‌లోని మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ సీనియర్ మేనేజర్ వి.మధు అన్నారు. ఎంజీ రోడ్డులోని శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యాన ఇంప్లిమెంటింగ్ సైబర్ సెక్యూరిటీ, ఐటీ ఇన్ ఏఐ రీసెంట్ ట్రెండ్స్ అనే అంశంపై శుక్రవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సదస్సు నిర్వహించారు. సదస్సులో వి.మధు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో వ్యాధి ముందస్తు హెచ్చరిక, పర్సనలైజ్డ్ మెడిసిన్, రోగులకు వేగవంతమైన చికిత్స అందించడంతో ఉపయోగపడుతుందన్నారు. మరోఅతిథి సాయిసతీష్ మాట్లాడుతూ మాల్వేర్ అనాలిసిస్ అంశంపై ప్రసంగించారు. మాల్వేర్ అనేది సైబర్‌భద్రతలో ఒక కీలకమైన అంశమని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కల్పన, స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ మోహన్ రూప ఎస్‌వీడీ, కో కో ఆర్డినేటర్ వి.సంధ్యాలక్ష్మి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రవీణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ హారిక పాల్గొన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు



మంగొల్లు గ్రంథాలయం సెంటర్‌లోని గణేషుడు

కంచికచర్ల : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కంచికచర్ల మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద భక్తులు శుక్రవారం వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. కంచికచర్ల పెట్రోలుబంక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బాలవినాయకుడికి పూజలు చేసి, భక్తులకు అన్న సమారాధన చేశారు. పశువుల ఆసుపత్రి రోడ్డు, తీగెల బజార్, రామాలయం పెద్ద బజార్, హనుమాన్‌పేట, పోలీస్‌స్టేషన్ సెంటర్, వసంతకాలనీ, మోడల్‌కాలనీ తదితర ప్రాంతాలతోపాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు భక్తులు పూజలు చేశారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : నవరాత్రి ఉత్సవాలను భక్తులు కోలాహలంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద స్వామివారి విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహాల వద్ద పూజల అనంతరం స్వామివారి లడ్డూను వేలంపాట నిర్వహిస్తున్నారు. నిమజ్జనాల సందర్భంగా భక్తులు జాగ్రత్తలు పాటించాలని ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు సూచించారు.

నందిగామ పట్టణంలో..

నందిగామటౌన్: స్థానిక ముక్కోటి మహా మండపంలోని గణనాథునికి శాస్త్రోక్తంగా పూలంగి సేవ నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనానికి తరలించారు.



కంచికచర్లలో బాలవినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

జగ్గయ్యపేట మండలంలో...

జగ్గయ్యపేట: వినాయకుడి మండపాల వద్ద ఏడోరోజు శుక్రవారం భక్తులు కుంకుమ పూజలు, హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ధర్మవరప్పాడుతండాలో గరికపూజ, వేదాద్రి, అనుమంచిపల్లిలోని మండపాల వద్ద వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. జగ్గయ్యపేట బ్రాహ్మణబజారులోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద మహిళలు కుంకుమ పూజలు చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: నవరాత్రి ఉత్సవాలలో జగ్గయ్యపేట పట్టణంలో ఏర్పాటు చేసిన గణనాథుల మండపాల వద్ద భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్థానిక సీతారామపురంలోని డాక్టర్స్ రోడ్డులో రైడర్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విగ్రహం వద్ద భక్తులు విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అయ్యప్పనగర్‌లో అల్పా వారియర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపం వద్ద దశమహామూలామంత్ర హోమం నిర్వహించారు. 1500మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.

పెనుగంచిప్రోలు మండలంలో..



పేట బ్రాహ్మణబజారులో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



పేట డాక్టర్స్ రోడ్‌లో గణేష్ విగ్రహం వద్ద పారాయణం చేస్తున్న మహిళలు

పెనుగంచిప్రోలు: గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గణపతి మండపం వద్ద ఏడోరోజు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనిగండ్లపాడు సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరితోపాటు పలు చోట్ల సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. సుబ్బాయిగూడెం, కొళ్లికూళ్ల, లింగగూడెం గ్రామాల్లోని మండపాల వద్ద భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



పేట అయ్యప్పనగర్‌లో హోమం చేస్తున్న భక్తులు



అనిగండ్లపాడులో వ్రతం ఆచరిస్తున్న భక్తులు



సుబ్బాయిగూడెంలో పూజలందుకుంటున్న గణనాథుడు

అప్పుల బాధతో కౌలురైతు మృతి



మృతుడు నాగరాజు(ఫైల్)

వెంకటాపురం(పెనుగంచిప్రోలు): అప్పుల బాధతో పురుగుమందు తాగి కౌలురైతు మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకటాపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం ...గ్రామానికి చెందిన కాసరపల్లి నాగరాజు(28) గత ఏడాదితోపాటు ఇటీవలన వచ్చిన వరదలకు పంట నష్టపోయి వారం రోజుల కిందట పురుగుల మందు తాగాడు. మెరుగైన వైద్యం కోసం అతన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం నాగరాజు మృతదేహాన్ని శుక్రవారం గ్రామానికి తీసుకువచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ఐకి వినతిపత్రం అందజేత



ఆర్ఐ జనార్దనరావుకు వినతిపత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణసంఘు నాయకులు

పెనుగంచిప్రోలు: ఈనెల 17వ తేదీన విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని విశ్వబ్రాహ్మణ సంఘం పెనుగంచిప్రోలు మండల నాయకులు కోరారు. ఈమేరకు శుక్రవారం వారు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐ జనార్ధనరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని గతేడాది రాష్ట్రప్రభుత్వం తరఫున నిర్వహించారని గుర్తుచేశారు. ఈసారి కూడా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్ఐకి వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ మండల అధ్యక్ష,కార్యదర్శులు నంచర్ల గోపాలరావు, తునికిపాటి శివ, మహిళా విభాగం అధ్యక్షురాలు పులికొండ మాధవి, జిల్లా కోశాధికారి పి.సాంబశివరావు, మండల నాయకులు తునికిపాటి రాంబాబు, రామకృష్ణ, శ్రీనివాసరావు, బ్రహ్మం పాల్గొన్నారు.